వెంటనే పిల్లల్ని కనండి

- యువ జంటలకు స్టాలిన్ పిలుపు
- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో సూచన

నాగపట్టణం(తమిళనాడు), మార్చి 3: పెళ్లి చేసుకుని వెంటనే పిల్లల్ని కనాలని యువతకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఎక్కువ మంది ఎంపీలు కావాలంటే ఎక్కువ జనాభా ఉండడమే ప్రధాన అర్హతగా కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం నాడిక్కడ ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన స్టాలిన్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ పాత రోజుల్లో పెళ్లయిన వెంటనే పిల్లల్ని కనవద్దని యువ జంటలకు సలహా ఇచ్చేవారని, అయితే ఇప్పుడు అదే సలహా ఇవ్వలేమని, ఇప్పుడు ఆ అవసరం కూడా లేదని ఆయన చెప్పారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగుతున్నందున ఎక్కువ జనాభా ఉంటే ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని స్టాలిన్ అన్నారు. జనాభా నియంత్రణపై తమిళనాడు దృష్టి పెట్టి విజయం సాధించిందని, ఇప్పుడు రాష్ట్రానికి ఈ దుస్థితి రావడానికి అదే కారణమని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గాల పునర్విభజన సమస్య తమిళనాడు హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించిందని, దీన్ని కేవలం రాజకీయ సమస్యగా మాత్రమే పరిగణించలేమని స్టాలిన్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మార్చి 5న చెన్నైలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గుర్తింపు పొందిన 40 పార్టీలలో అధిక పార్టీలు సమావేశానికి రావడానికి అంగీకారం తెలియజేశాయని చెప్పారు.

కేంద్ర బకాయిలపై చట్టపరమైన చర్యలు

1.36 లక్షల కోట్లు రావాలి • జార్ఖండ్ ఆర్థికమంత్రి ప్రకటన

రాంచీ, మార్చి 3: గనుల రాయల్టీ, పన్నులకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలపై చట్టపరమైన చర్యలకు దిగుతున్నట్టు జార్ఖండ్‌లోని హేమంత్ సోరేన్ సర్కార్ ప్రకటించింది. బొగ్గు తవ్వకాలపై రూ.1.36 లక్షల కోట్ల బకాయిలను కేంద్రం పెండింగ్‌లో ఉంచిందని, వీటిని చెల్లించాలంటూ చట్టపరమైన చర్యలను చేపడుతున్నట్టు జార్ఖండ్ ఆర్థికమంత్రి రాధాకృష్ణ కిశోర్ సోమవారం అసెంబ్లీలో చెప్పారు. సభలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. దీనికంటే ముందు ప్రశ్నోత్తరాల సమయంలో ఎక్సైజ్ మంత్రి యోగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, కచ్చితమైన బకాయి మొత్తాన్ని అంచనా వేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులతో కూడిన సంయుక్త కమిటీ ఒకదాన్ని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కోల్ ఇండియా సహా వివిధ సంస్థలు జార్ఖండ్‌లో బొగ్గు తవ్వకాలు చేపట్టడం ద్వారా పన్నులు, రాయల్టీ రూపంలో రాష్ట్రానికి రూ.1.36 లక్షల కోట్లు రావాల్సి ఉందని గత కొన్నేండ్లుగా జార్ఖండ్ సర్కార్ వాదిస్తున్నది. కేంద్రం నుంచి బకాయిలు రాబట్టడంపై చట్టపరమైన ప్రక్రియ కోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్, భూ సంస్కరణల శాఖ కార్యదర్శికి అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఓ నోటిఫికేషన్ కూడా జారీచేసింది. కేంద్రం బకాయిల్ని పెండింగ్‌లో ఉంచటం వల్ల జార్ఖండ్ అభివృద్ధికి నివారించలేని నష్టం వాటిల్లుతుందని సీఎం హేమంత్ సోరేన్ చెబుతున్నారు.

బడ్జెట్ ప్రతులను సీఎం సోరేన్ నుంచి అందుకుంటున్న రాధాకృష్ణ కిశోర్

ఓలాలో వెయ్యికి పైగా ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ వెయ్యి మందికి పైగా ఉద్యోగులను, ఒప్పంద కార్మికులను తొలగించనున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న ఈ కంపెనీ కొనుగోళ్లు, కస్టమర్ రిలేషన్స్ సహా పలు విభాగాల్లో ఉద్యోగులను ఇంటికి పంపించనున్నట్టు సమాచారం. నిరుడి డిసెంబర్ త్రైమాసికంలో తమకు రూ.564 కోట్లు నష్టాలు వచ్చాయని చెప్పిన ఈ కంపెనీ.. నిరుడు నవంబర్‌లో 500 మంది ఉద్యోగులను తొలగించింది. తాజాగా తొలగించనున్న ఉద్యోగులు కంపెనీ మొత్తం సిబ్బందిలో పావు శాతం ఉంటారని అంచనా. ఫ్రంట్ ఎండ్ ఆపరేషన్లను ఆటోమేటెడ్ చేసి, ఖర్చులను తగ్గించుకొని, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడానికి కంపెనీని పునర్ నిర్మిస్తున్నామని ఓలా అధికార ప్రతినిధి తెలిపారు.

వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు జనరల్ బోగీలే

- ఏసీ, స్లీపర్ బోగీల్లో ప్రయాణిస్తే జరిమానా
- ఈ నెల 1 నుంచి రైల్వే కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణం కోసం బెర్త్ రిజర్వు కానటువంటి, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులు జనరల్ బోగీల్లో మాత్రమే ప్రయాణించాలి. వీరు స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణించడానికి ఈ టికెట్లు చెల్లవు. ఒకవేళ వెయిటింగ్ లిస్టెడ్ టికెట్లతో స్లీపర్, ఏసీ బోగీల్లో ప్రయాణిస్తే జరిమానా చెల్లించక తప్పదు. ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికులు ఆ టికెట్లతో ఏసీ బోగీలో ప్రయాణిస్తే, ఆ రైలు ఎక్కడి నుంచి ప్రారంభమైందో అక్కడి నుంచి తదుపరి స్టేషన్ వరకు టికెట్ ఛార్జీని, రూ.440 ఫైన్‌ను చెల్లించాలి. స్లీపర్ బోగీల్లో ప్రయాణిస్తే, రూ.250 జరిమానాతోపాటు, తదుపరి స్టేషన్ వరకు టికెట్ ఛార్జీని చెల్లించాలి.

సీఎం మార్పుపై మళ్లీ లొల్లి

- కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న నాయకత్వ పోరు
- డీకే ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ అడ్డుకోలేరు
- కాంగ్రెస్ నేత వీరప్ప మొయిలీ సంచలన వ్యాఖ్యలు
- హైకమాండ్‌దే తుది నిర్ణయమన్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, మార్చి 3: కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వం మార్పు పోరు రోజురోజుకూ ముదురుతోంది. ఈ ఏడాది డిసెంబర్ లోపల ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజు వీ శివగంగ ఆదివారం జోస్యం చెప్పగా, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ అడ్డుకోలేరంటూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు వీరప్ప మొయిలీ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. నాయకత్వం మార్పుపై అధిష్టానం నిర్ణయమే అంతిమమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేయగా ఈ అంశంపై తాను ఏమీ మాట్లాడలేనంటూ డీకే శివకుమార్ మౌనాన్ని ఆశ్రయించారు. కర్ణాటకలోని కర్కాలాలో సోమవారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న వీరప్ప మెయిలీ ముఖ్యమంత్రి మార్పు తథ్యమని, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. అది పరిష్కారమైపోయిన అంశమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా డీకే బాధ్యతలు ఏ క్షణంలోనైనా చేపట్టవచ్చని, తన కష్టం, నాయకత్వ పటిమతోనే డీకే ఆ స్థానాన్ని సంపాదించుకుంటున్నారని మెయిలీ అన్నారు. డీకేకు మొదటి సారి ఎమ్మెల్యేగా టికెట్ ఇవ్వడంలో తన పాత్రను ఆయన గుర్తు చేసుకుంటూ రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో పార్టీ కోసం డీకే చేసిన సేవలను మొయిలీ ప్రశంసించారు. నాయకత్వ మార్పుపై పార్టీలో అంతర్గతంగా చర్చలు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిని డీకే చేపట్టడం అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. విమర్శలు లేక ఊహాగానాలు ఎలా ఉన్నప్పటికీ డీకే ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ అడ్డుకోలేరన్నారు.

నో కామెంట్: డీకే

రాష్ట్రంలో నాయకత్వం మార్పుపై వీరప్ప మొయిలీ చేసిన వ్యాఖ్యలపై స్పందించడానికి డీకే శివకుమార్ నిరాకరించారు. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని డీకే జవాబిచ్చారు. ముఖ్యమంత్రి మార్పుపై పార్టీలో జోరుగా సాగుతున్న ప్రచారంపై వ్యాఖ్యానించడానికి డీకే నిరాకరించారు. తాను పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉన్నానని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రమంతా పర్యటించి బూత్ కమిటీల చేత ప్రతిజ్ఞ చేయించాల్సి ఉందని ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. తాను బీజేపీకి దగ్గరవుతున్నానంటూ వస్తున్న వార్తలను డీకే తోసిపుచ్చారు. అదంతా తప్పుడు ప్రచారమని, కాంగ్రెస్ పట్ల తన విధేయత చెక్కుచెదరదని ఆయన పునరుద్ఘాటించారు.

అధిష్టానం నిర్ణయమే ఫైనల్: సిద్ధరామయ్య

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు తాను నడుచుకుంటానని, నాయకత్వం మార్పుపై నిర్ణయం తీసుకోవలసింది అధిష్టానమేనని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం స్పష్టం చేశారు. వీరప్ప మొయిలీ చేసిన ప్రకటనపై సిద్ధరామయ్య స్పందిస్తూ దీనిపై అధిష్టానమే నిర్ణయం తీసుకోవాలని తాను మొదటి నుంచి చెబుతున్నానని అన్నారు. మొయిలీ చెప్పారా లేక మరెవరైనా చెప్పారా అన్నది ముఖ్యం కాదని, అధిష్టానం ఏమి చెప్పినా అదే ఫైనల్ అంటూ సీఎం చెప్పారు.

నిన్న రిక్లెయినర్లు.. నేడు మసాజ్ కుర్చీలు!

కర్ణాటక అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు సౌకర్యాలు

లంచ్ తర్వాత ఎమ్మెల్యేలు కునుకు తీసేందుకు ఇప్పటికే కర్ణాటక శాసనసభలో రిక్లెయినర్లు ఏర్పాటుచేయగా, తాజాగా మసాజ్ కుర్చీలను కూడా ఏర్పాటుచేయనున్నట్టు స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. ఇదేం ఆడంబరం కోసం కాదని, గంటల తరబడి అసెంబ్లీలో కూర్చొని అలసిపోతున్న ఎమ్మెల్యేలకు సౌకర్యవంతంగా ఉండాలన్నదే తన ఆరాటమని చెప్పుకొచ్చారు.రాష్ట్రం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో అనవసర ఖర్చులెందుకని బీజేపీ అభిప్రాయపడింది. రాష్ట్రంలో నిధుల కొరత ఉందని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని బీజేపీ ఎంఎల్‌సీ సీటీ రవి అన్నారు. ముందు కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించి ఆ తర్వాత మీ సుఖం కోసం కుర్చీలు తెచ్చుకోండని ఆయన వ్యాఖ్యానించారు.

భారత మహిళకు యూఏఈలో ఉరిశిక్ష

న్యూఢిల్లీ: నాలుగు నెలల చిన్నారి హత్య కేసులో దోషిగా తేలిన యూపీ మహిళ షాజాదీ ఖాన్(33)కు అబుదాబీలో ఉరిశిక్షను అమలుజేశారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. యూఏఈ చట్టాలు, నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 15న షాజాదీ ఖాన్‌కు ఉరిశిక్ష విధించినట్టు కోర్టుకు వెల్లడించింది. ఇందుకు సంబంధించి అధికారిక సమాచారం ఫిబ్రవరి 28న యుఏఈలోని భారత ఎంబసీకి చేరిందని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు తెలిపారు. యూఏఈలో తన కూతురు షాజాదీ ఖాన్ చట్టపరమైన స్థితి తెలియజేయాలంటూ ఆమె తండ్రి ఢిల్లీ హైకోర్టును ఇటీవల ఆశ్రయించారు.

జడ్జీల నియామకానికి దృష్టి లోపం అనర్హత కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: శారీరక వైకల్యాల కారణాన్ని చూపుతూ ఏ వ్యక్తినీ జ్యుడిషియల్ సర్వీసులో ఉద్యోగ నియామకం చేయకుండా అడ్డుకోలేరని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. కొన్ని రాష్ట్రాల జ్యుడిషియల్ సర్వీసులలో శారీరక వైకల్యం ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ చూపులేని అభ్యర్థి తల్లి రాసిన లేఖను సుమోటోగా విచారణకు స్వీకరించిన కోర్టు ఈ తీర్పును వెలువరించింది. శారీరక వైకల్యాలను కారణంగా చూపుతూ ఏ ఒక్కరినీ జ్యుడిషియల్ సర్వీసులో నియామకాల కోసం తిరస్కరించకూడదని స్పష్టం చేసింది.

ఆన్‌లైన్ కంటెంట్‌ను క్రమబద్ధీకరించాలి

కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాల్లో వచ్చే కంటెంట్‌ను క్రమబద్ధీకరించేందుకు ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం చెప్పింది. అయితే, ఈ కంటెంట్‌పై సెన్సార్‌షిప్ ఉండకూడదని తెలిపింది. వాక్ స్వాతంత్ర్యం హక్కుకు విఘాతం కలుగకూడదని స్పష్టం చేసింది. ఈ రంగంతో సంబంధం ఉన్నవారందరి సలహాలు, అభిప్రాయాలను తీసుకోవాలని సూచించింది. పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అల్హాబాదియా కేసు విచారణ సందర్భంగా ఈ ఆదేశాలిచ్చింది.

పీయూష్ గోయల్.. ఆకస్మికంగా అమెరికాకు

- పరస్పర టారిఫ్‌లపై ట్రంప్ సర్కార్‌తో చర్చలు

న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ఆకస్మికంగా అమెరికాకు బయలుదేరారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై పరస్పర సుంకాలు విధిస్తామని ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో పీయూష్ గోయల్ హడావిడిగా అమెరికాకు బయలుదేరారు. మే 8 వరకు ఆయన అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రతిపాదిత సుంకాల గురించి అగ్రదేశాన్ని స్పష్టత కోరటం, వాటివల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయటంతో సహా సుంకాల తగ్గింపు, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవటం..మొదలైనవి ఆయన అమెరికా పర్యటనలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. అమెరికా సుంకాల వల్ల భారత్ ఎగుమతులపై 7 బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని నిపుణులు అంచనా.

పుతిన్ కంటే వారితోనే అధిక ముప్పు

అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: అమెరికాలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంటే అక్రమ వలసదారులతోనే ముప్పు ఎక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు 'ట్రూత్' సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టారు. పుతిన్ గురించి తాను ఆందోళన చెందడం లేదని, అమెరికాకు యూరప్ గతి పట్టకుండా చూసేందుకు అక్రమ వలసలను నిరోధించడంపైనే దృష్టి కేంద్రీకరించానని తెలిపారు. పుతిన్ గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని, అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న రేప్ గ్యాంగ్‌లు, డ్రగ్ లార్డులు, హంతకులు, మెంటల్ సంస్థల వ్యక్తులపైనే మనం దృష్టి సారించాలని, అప్పుడే మనకు యూరప్ లాంటి పరిస్థితి ఏర్పడదని స్పష్టం చేశారు. గత నెల రోజుల్లో తాను చేపట్టిన చర్యల వల్ల అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు చారిత్రక కనిష్ఠ స్థాయికి తగ్గాయని మరో పోస్టులో ట్రంప్ వెల్లడించారు. ఫిబ్రవరిలో అమెరికా సరిహద్దు వద్ద కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే పట్టుబడ్డారని, వారందరినీ వెంటనే వెనక్కి పంపేశామని వివరించారు. జో బైడెన్ అధికారంలో ఉన్నప్పుడు అమెరికాలోకి ప్రతి నెలా దాదాపు 3 లక్షల మంది అక్రమంగా ప్రవేశించేవారని విమర్శించారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

భద్రాద్రి ఎస్పీ వెల్లడి

కొత్తగూడెం ప్రగతిమైదాన్, మార్చి 3 : మావోయిస్టు సిద్ధాంతాలపై అసంతృప్తి చెందిన ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందిన పార్టీ మిలీషియా, సీఎన్ఎం సభ్యులు 14 మంది లొంగిపోయినట్టు భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పామేడ్ పరిధి మంగలతోరుకు చెందిన మడివి భీమా, ఆర్‌పీసీ సీఎన్ఎం ఎర్రపల్లి అధ్యక్షులు సోడి ఉంగా, మడివి అడుమ, కుంజాం కోసా, కోవాసి నంద, మడివి భీమా, మాసా, బీజాపూర్ జిల్లా దొడ్డితుమ్నార్‌కు చెందిన కుంజాం లక్మా, కస్తూరిపాడుకు చెందిన వెట్టి లక్కే, చుక్కయ్య, కోసా, భీమా, సోడి రాధిక, కుహ్రామికాజల్ లొంగిపోయిన వారిలో ఉన్నట్టు వివరించారు. కాగా బీజాపూర్ జిల్లా గంగలూరు ఏరియా కమిటీ కార్యదర్శి దినేశ్ తన భార్య, కుమార్తెతో వచ్చి లొంగిపోయినట్టు తెలిసింది.

అమెరికాకు రుణపడి ఉన్నాం

జెలెన్‌స్కీ వీడియో సందేశం

న్యూఢిల్లీ, మార్చి 3: రష్యాకు వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధంలో మద్దతు తెలియచేసిన అమెరికా పట్ల ఉక్రెయిన్‌కు కృతజ్ఞతాభావం లేదంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిందించిన దరిమిలా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. అమెరికా ప్రాధాన్యతను తాను అర్థం చేసుకోగలనని, ఆ దేశం చేసిన సాయానికి తాము రుణపడి ఉంటామని సోమవారం ఎక్స్ వేదికగా విడుదల చేసిన ఓ వీడియోలో జెలెన్‌స్కీ ప్రకటించారు. అమెరికా చేసిన సాయానికి కృతజ్ఞత లేదని, తాము ప్రతిపాదించిన శాంతి ఒప్పందం షరతులను అంగీకరించడం లేదంటూ శుక్రవారం రాత్రి వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో జరిగిన విలేకరుల సమావేశంలో జెలెన్‌స్కీపై అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ మండిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ తాజాగా వీడియో సందేశం విడుదల చేశారు. అమెరికా పట్ల కృతజ్ఞతను తాము ఒక్కరోజు కూడా మరచిపోలేదని ఆయన చెప్పారు. శాంతి పునరుద్ధరణ జరగాలని, భద్రతాపరమైన హామీలు వాస్తవ హామీలు కావాలని ఆయన అన్నారు. యూరపు ఖండం, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, తుర్కియే అన్నీ కూడా ఒకే వైఖరితో ఉన్నాయని ప్రకటించారు. లండన్‌లో ఆదివారం బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ నిర్వహించిన శిఖరాగ్ర సదస్సులో ఫ్రాన్స్ ప్రధాని ఇమాన్యుయెల్ మాక్రాన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పాల్గొన్నారు.

యుద్ధం ముగింపు.. చాలా దూరం

ఉక్రెయిన్,రష్యా మధ్య యుద్ధం ముగించే ఒప్పందం చాలా చాలా దూరంలో ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం రాత్రి ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన సంబంధాలు దెబ్బతిన్నప్పటికీ అమెరికా మద్దతు కొనసాగుతుందని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. అమెరికాతో తమ సంబంధాలు కొనసాగుతాయని తాను భావిస్తున్నానని, అవి సందర్భోచిత సంబంధాలు కావని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి ఆర్థిక సాయం నిరంతరం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, యుద్ధం ముగింపు చాలా దూరమన్న జెలెన్‌స్కీ వ్యాఖ్యలపై ట్రంప్ మండిపడ్డారు. ఇది వరస్ట్ స్టేట్‌మెంట్ అని దుయ్యబట్టారు. జెలెన్‌స్కీ శాంతిని కోరుకోవట్లేదని విమర్శించారు.

మాయావతి మేనల్లుడు బీఎస్పీ నుంచి ఔట్

లక్నో: బహుజన సమాజ్ వాదీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి సోమవారం తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. అతడిని పార్టీ పదవుల నుంచి తొలగించిన మరుసటి రోజే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు ఆకాశ్ ఇచ్చిన సమాధానం స్వార్థం, అహంకారంతో కూడి ఉందని మాయావతి అన్నారు. దీన్ని బట్టి అతడు తన మామ, రాజ్యసభ ఎంపీ అశోక్ సిద్ధార్థ్ ప్రభావం నుంచి ఇంకా బయట పడనట్టు కనిపిస్తున్నదని తెలిపారు. ఆకాశ్‌కు రాజకీయ పరిపక్వత రాలేదని మాయావతి అభిప్రాయపడ్డారు.

రోగం పోవాలని పసివాడికి 40 వాతలు

ఒడిశాలో దారుణం

భువనేశ్వర్: జ్వరంతో గుక్కపెట్టి ఏడుస్తున్న నెల రోజుల పసికందు పట్ల అతడి కుటుంబం మూఢ నమ్మంతో అమానుషంగా ప్రవర్తించింది. ఇనుప కడ్డీతో శిశువుకు 40 వాతలు పెట్టింది. ఈ ఘటన ఒడిశాలోని నబరంగ్‌పూర్ జిల్లాలో జరిగిందని అధికారులు సోమవారం తెలిపారు. పుండెల్పదా గ్రామానికి చెందిన బాధిత శిశువు ప్రస్తుతం ఉమెర్‌కోట్ సబ్ డివిజనల్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని సీడీఎంవో డాక్టర్ సంతోష్ కుమార్ పాండా తెలిపారు. 'పసివాడి పొట్ట, తలపై 30-40 వాతలు కనిపించాయి. వేడి లోహంతో గుర్తులు వేస్తే రోగాలు నయమవుతాయనే మూఢ నమ్మకం వల్లే వాళ్లు ఇలా చేశారు' అని ఆయన తెలిపారు.

అయోధ్య రామాలయంపై ఉగ్రదాడికి కుట్ర

న్యూఢిల్లీ: పాక్ ఐఎస్ఐ మద్దతుతో తీవ్రవాద గ్రూపులు అయోధ్య రామాలయంపై పన్నిన ఉగ్రదాడి కుట్ర భగ్నమైంది. ఐఎస్ఐతో సంబంధాలున్నాయని భావిస్తున్న అబ్దుల్ రెహ్మాన్ అనే వ్యక్తి ఫరీదాబాద్‌లో గుజరాత్ ఏటీఎస్ , హర్యానా ఎస్‌టీఎఫ్ అధికారులకు చిక్కాడు. నిందితుడు అబ్దుల్ రెహ్మాన్ ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడిగా గుర్తించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గ్రనేడ్‌లను నిర్వీర్యం చేశారు. అయోధ్య రామాలయంపై ఉగ్రదాడి జరిపేందుకు కుట్ర జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడు అనేక మార్లు రామాలయం చుట్టూ చక్కర్లు కొట్టి, సమాచారాన్ని ఐఎస్ ఐకి చేరవేశాడని, హ్యాండ్ గ్రనేడ్లు అందుకున్నాక అయోధ్యకు రావాలనుకున్నాడని తెలిసింది.

• గిర్ అడవుల్లో ప్రధాని మోదీ సఫారీ

ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం గుజరాత్ జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సింహాల సఫారికి వెళ్లారు. పెద్ద పులులు, సింహాలను ఫొటోలు తీశారు. గిర్ అడవుల్లోని వృక్షజాలం, జంతుజాలాలను తెలిపే చిత్రాలను తీశారు.

దేశంలో 6,324 డాల్ఫిన్లు

న్యూఢిల్లీ: దేశంలో 6,324 డాల్ఫిన్లు ఉన్నట్టు తేలింది. కేంద్ర ప్రభుత్వం తొలిసారి నదీ ఆవాస డాల్ఫిన్లపై సర్వే నిర్వహించి, సోమవారం నివేదికను విడుదల చేసింది. 'ప్రాజెక్ట్ డాల్ఫిన్'లో భాగంగా 8 వేల కిలోమీటర్ల పరిధిలో 2021-2023 మధ్య కాలంలో ఈ గణాంకాలు సేకరించారు. ఈ డాల్ఫిన్లు గంగ, బ్రహ్మపుత్ర, సింధు నదులు, వాటి ఉప నదుల పరీవాహక ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపింది. గంగా నది డాల్ఫిన్లకు ఎన్నో ప్రత్యేకతలుంటాయని, ఇవి గంగ-బ్రహ్మపుత్ర-మేఘన నదీ వ్యవస్థలు, వాటి ఉప నదుల్లో భారత్, బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్ దేశాల్లో కనిపిస్తాయని నివేదిక వెల్లడించింది. ఈ తిమింగలాలతో దగ్గరి సంబంధం ఉన్న మూడు సింధు నది డాల్ఫిన్లు భారత్‌లోని సింధు నదిలో కనిపించాయని చెప్పింది.

అంటార్కిటిక్ ప్రవాహం మందగమనం

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన మహాసముద్రం అంటార్కిటిక్ ప్రవాహ వేగం తగ్గుతున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. వాతావరణ మార్పులే దీనికి కారణమని, దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. సముద్ర మట్టాల పెరుగుదల, మహాసముద్రాలు వేడెక్కడం వంటి వైపరీత్యాలు సంభవిస్తాయని చెప్పారు. అంటార్కిటిక్ సర్కమ్‌పోలార్ కరంట్ (ఏసీసీ) సవ్య దిశలో ప్రవహిస్తుంది. ఇది గల్ఫ్ ప్రవాహం కన్నా నాలుగు రెట్లు శక్తిమంతమైనది. భూ మండలంలో వాతావరణం అందరికీ అనుకూలంగా ఉండేలా చేయడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తున్నది. మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ నివేదిక 'ఎన్విరాన్‌మెంటల్ రిసెర్చ్ లెటర్స్'లో ప్రచురితమైంది.

అల్ట్రాస్లిమ్ సోలార్ ల్యాప్‌టాప్!

- ప్రపంచంలో తొలిసారి ఆవిష్కరించిన లెనోవో
- 20 నిమిషాల చార్జింగ్.. గంట వినియోగం



బార్సిలోనా: ఎలక్ట్రానిక్స్ దిగ్గజం లెనోవో సరికొత్త ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. ప్రపంచంలోనే మొట్టమొదటి అల్ట్రాస్లిమ్ సోలార్ పవర్ ఆధారిత ల్యాప్‌టాప్‌ను అభివృద్ధి చేసింది. 'యోగా సోలార్ పీసీ'గా పిల